BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com


హైదరాబాద్ బుధవారం 11 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

## టీజీపీఎస్సీ గ్రూప్-3 సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వాయిదా

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో గ్రూప్-3 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ముఖ్య గమనిక. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన ధృవపత్రాల పరిశీలన ప్రక్రియ వాయిదా పడింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) మంగళవారం సాయంత్రం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. గ్రూప్-3 అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను జూన్ 18వ తేదీ నుంచి జులై 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు టీజీపీఎస్సీ జూన్ 6న ఒక షెడ్యూల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఈ ప్రక్రియను ప్రస్తుతానికి నిలిపివేస్తున్నట్లు కమిషన్ తాజాగా వెల్లడించింది. గ్రూప్-3 సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభించడానికి ముందే గ్రూప్-2 నియామక ప్రక్రియను పూర్తి చేయాలని పలువురు అభ్యర్థుల నుంచి టీజీపీఎస్సీకి విజ్ఞప్తులు అందాయి. ఈ వినతులను పరిగణనలోకి తీసుకున్న కమిషన్, గ్రూప్-3 ధృవపత్రాల పరిశీలనను వాయిదా వేయాలని నిర్ణయించినట్లు తన వెబ్‌నోట్‌లో పేర్కొంది. టీజీపీఎస్సీ కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్ ఈ విషయంపై స్పందిస్తూ, గ్రూప్-3 అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు సంబంధించిన కొత్త తేదీల షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. అభ్యర్థులు తదుపరి ప్రకటనల కోసం టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌ను గమనిస్తూ ఉండాలని సూచించారు.

# విద్యుత్ ఉద్యోగులకు రూ. కోటి ప్రమాద బీమా



- రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచే కార్యక్రమం
- రికార్డ్ స్థాయిలో డిమాండ్ పెరిగినా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా
- రాష్ట్ర అభివృద్ధిలో విద్యుత్ శాఖ అగ్రస్థానంలో ఉండాలి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర, దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్న 51,868 మంది విద్యుత్ ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా పథకం రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచే కార్యక్రమమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హైదరాబా ద్‌లోని ప్రజాభవన్‌లో విద్యుత్ ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమాపై బ్యాంకర్లతో ఒప్పందం చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో భట్టి మాట్లాడారు.

రాష్ట్ర ప్రజల కోసం పనిచేసే ప్రధాన సంస్థల్లో ఒకటైన విద్యుత్ సంస్థ సిబ్బంది, కుటుంబాల కోసం ప్రమాద బీమా పథకం తీసుకురావడం వ్యక్తిగతంగా తనకు తృప్తినిచ్చిందని తెలిపారు. విద్యుత్ శాఖ ఉద్యోగులు ప్రాణాలు అడ్డుపెట్టి విధులు నిర్వహిస్తారని కొనియాడారు. రాష్ట్ర జీడీపీ పెరుగుదలకు ఈ శాఖ ఇంధనంగా ఉపయోగపడుతున్నదన్నారు. ఈ పథకం విద్యుత్ శాఖలో కనిష్ట స్థాయి నుంచి ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ వరకు అన్ని స్థాయి ఉద్యోగులకు వర్తించనుందని చెప్పారు.

"లైన్‌మన్ నుంచి సీఎండీ వరకు ప్రతి ఉద్యోగి కుటుంబం ఉంది. పదవులు వేరు కావచ్చు, కానీ కుటుంబ బాధ్యతల విషయంలో అందరూ సమానమే. కుటుంబాన్ని నిర్వహించే వ్యక్తికి ఏదైనా ప్రమాదం జరిగితే, వారి కుటుంబం తీవ్ర సంక్షోభానికి గురవుతుంది. అటువంటి పరిస్థితులు రాకుండా చూసేందుకే ఈ బీమా పథకాన్ని రూపొందించాం" అని డిప్యూటీ సీఎం వివరించారు. ఈ పథకం కేవలం ప్రమాద బీమా పరిరక్షణనే కాదు, వివాహ రుణాలు, విద్యా రుణాలు వంటి ఆర్థిక సాయాన్ని కూడా కల్పిస్తుందని తెలిపారు. శాశ్వతంగా వికలాంగులైన ఉద్యోగులకు రూ.80 లక్షల వరకు నష్ట పరిహారం లభించనుంది. సహజ మరణం జరిగితే రూ.10 లక్షల బీమా, ఇక మొత్తం రూ.20 లక్షల వరకూ బీమా కవరేజ్ ఉద్యోగి మరియు ఆయన కుటుంబంలోని నాలుగు మంది సభ్యులకు వర్తించనుంది. ఖాతాలో నగదు లేకపోయినా సేవలు పొందవచ్చు అని స్పష్టంగా చెప్పారు. ఏటీఎం కార్డు లేదా చెక్క పుస్తకాలపై కూడా ఎలాంటి ఛార్జీలు ఉండవని వెల్లడించారు.

2025 నాటికి రాష్ట్రంలో గరిష్టంగా 17,162 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైనట్టు తెలిపారు. ఇది 2023తో పోలిస్తే సుమారు 2,000 మెగావాట్లు ఎక్కువ. అయినప్పటికీ, నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగించగలిగిన విద్యుత్ శాఖ ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ఇకపోతే, గత దశాబ్దకాలంగా తెలంగాణలో ఒక ప్రత్యేక విద్యుత్ విధానం లేకపోవడం వల్ల రాష్ట్రం వెనుకబడిందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని 2025 నూతన గ్రీన్ ఎనర్జీ పాలసీని ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా రాష్ట్ర వనరులనే కాక, దేశ వ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీని వినియోగించి, 2030 నాటికి 20,000 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.

రీజినల్ రింగ్ రోడ్డు, మూసీ పునర్జీవం, ఫ్యూచర్ సిటీ ఇలా రకరకాల ప్రాజెక్టులు రాష్ట్రంలో ప్రారంభమై నట్టు భట్టి వెల్లడించారు. రీజినల్ రింగ్ రోడ్డుతో రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే వివిధ క్లస్టర్లతో ప్రపంచ నలుమూలల నుంచి పెట్టుబడి కోసం అంతా హైదరాబాద్‌కు తరలివస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ ఉత్పత్తి పెంచడంతోపాటు కాలుష్య రహిత గ్రీన్ ఎనర్జీని సమకూర్చు కునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలతో పని చేస్తున్నదని వివరించారు. గత పది సంవత్సరాలు ప్రత్యేక విద్యుత్ పాలసీ లేకపోవడంతో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మనం వెనుకబడిపోయామని వివరించారు. ఈ లోటును గుర్తించి ప్రభుత్వం ఏర్పడగానే 2025 న్యూ గ్రీన్ ఎనర్జీ పాలసీని తీసుకువచ్చామని గుర్తుచేశారు. 2030 నాటికి 20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్నదని చెప్పారు. ఒకవైపు ఉత్పత్తి పెంచుకుంటూనే సరఫరాలో 75 శాతం లక్ష్యాన్ని చేరుకోగానే సరఫరా వ్యవస్థను అప్డేట్ చేసుకుంటూ ముందుకు పోతున్నామని చెప్పారు. అందుకే అదనంగా రెండు వేల మెగావాట్ల పీక్ డిమాండ్ వచ్చినా రాష్ట్రంలో రెప్పపాటు అంతరాయం లేకుండా ఈ వేసవిలో విద్యుత్ సరఫరా జరిగిందని డిప్యూటీ సీఎం వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ సీఎం డి సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




# 26న తొలి బోనం

- ఆషాడ మాస బోనాలకు ఘనంగా ఏర్పాట్లు
- 28 దేవాలయాల్లో ఘనంగా బోనాల నిర్వహణ
- ఆషాడ బోనాల సమీక్షలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్
- అధికారులతో సమీక్షా సమావేశం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

గోల్కొండ మహంకాళికి ఈ నెల 26న తొలిబోనం సమర్పణతో ఆషాడ బోనాలు హైదరాబాద్‌లో ప్రారంభమవుతాయనీ, 28 దేవాలయాల్లో ఘనంగా బోనాల నిర్వహించనున్నట్టు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వాటికి సబంధించిన ఏర్పాట్లను పకడ్బంధీగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయం చేసుకుంటూ పని చేయాలని సూచించారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణపై హైదరాబాద్‌లో మంగళవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. బోనాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.20 కోట్లు కేటాయించిందని తెలిపారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మరిన్ని నిధులు కేటాయించాలని కోరుతామని చెప్పారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 26న గోల్కొండ కోటలో తొలిబోనం సమర్పణ ఉంటుందనీ, ఆ తర్వాత బల్కంపేట, ఉజ్జయిని మహంకాళీ, లాల్ దర్వాజ బోనాలుంటాయని వివరించారు. దేవాలయాలకు ఇచ్చే చెక్కులను రెవెన్యూ, దేవాదాయ శాఖలు కోఆర్డినేట్ చేసుకుని పండుగలకు ముందే పూర్తిచే యాలని సూచించారు. అధికారులు ఉద్యోగం లాగా కాకుం డా సేవా దృక్పథంతో పని చేయాలని కోరారు. శాంతి, భద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని ఆదేశించారు. సమీక్షలో జీహెచ్ ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, డీజీపీ జితేందర్, ఎండోమెంట్ డైరెక్టర్ వెంకటరావు, సీపీ సివి.ఆనంద్, హైదరాబాద్, రంగారెడ్డి కలెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీల చైర్మెన్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రూ.2,125 కోట్ల పెట్టుబడులు




- యూఏఈకి చెందిన ప్రముఖ కంపెనీలు శైవా గ్రూప్, తారానిస్ క్యాపిటల్ సంస్థలు రాష్ట్రానికి చెందిన ఐదు సంస్థలతో ఎంఓయూ
- 5020 మందికి ఉపాధి
- 18 నెలల్లో 60 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో మరో 5 సంస్థల పెట్టుబడులు, 5020 మందికి ఉపాధి కలగనుందని తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల్లో 60 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం..అని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి తెలంగాణ యువతకు ఉద్యోగాలు కల్పించాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంకల్పం అని పేర్కొన్నారు. యూఏఈకి చెందిన ప్రముఖ కంపెనీలు శైవా గ్రూప్, తారానిస్ క్యాపిటల్ సంస్థలు రాష్ట్రానికి చెందిన ఐదు సంస్థలతో సచివాలయంలో మంత్రి సమక్షంలో ఎంవోయూ కుదుర్చుకున్నాయి. రాష్ట్రంలో రూ.2,125 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకున్నాయి. దీని వల్ల 5,020 మందికి ఉపాధి లభించనున్నట్లు సంస్థలు వెల్లడించాయి.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ 18 నెలల కాంగ్రెస్ పాలనలో 60వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులను తెలంగాణకు తీసుకొచ్చాం. ఫలితంగా ప్రైవేట్ రంగంలో లక్ష మందికి పైగా తెలంగాణ యువతకు ఉద్యోగాలు లభించాయి. తెలంగాణ రైజింగ్ ప్రయాణంలో ఈరోజు మరో గొప్ప అడుగు వేయబోతున్నాం. కొత్తగా మరో 5,020 మంది తెలంగాణ యువతకు ఉపాధి దక్కబోతుందనే విషయాన్ని తెలియజేయడానికి చాలా సంతోషంగా ఉంది. అటు సంక్షేమం.. ఇటు అభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు ధీటుగా దూసుకెళ్తున్న తెలంగాణ పురోగతిలో భాగస్వామయ్యేందుకు ముందుకొచ్చిన యూఏఈకి చెందిన ప్రముఖ కంపెనీలు శైవ గ్రూప్, టారనిస్ కేపిటల్‌ను ప్రభుత్వం తరపున సాదరంగా ఆహ్వానిస్తున్నాం..అని మంత్రి పేర్కొన్నారు. మహిళల కోసం తెలంగాణలో SITHA యాప్ Advertisement ఇది తొలి అడుగు మాత్రమే. రాబోయే మూడేళ్లలో బయోటెక్, ఏఐ, డేటా సెంటర్, డిఫెన్స్, ఎనర్జీ, ఫిన్ టెక్, పబ్లిక్ సెక్టార్స్ తదితర రంగాల్లో లో మరో రూ.24వేల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు శైవ గ్రూప్, టారనిస్ కేపిటల్సంసిద్ధత వ్యక్తం చేశాయి. ఈ రెండు కంపెనీలు రాబోయే మూడేళ్లలో బయోటెక్ రంగంలో తినుబండారాల్లో చక్కెర శాతాన్ని తగ్గించడం, యాంటీ డయాబెటిక్, ఫుడ్ మేనేజ్ మెంట్ ప్రొడక్ట్స్ పై ప్రత్యేక దృష్టి సారించనున్నాయి. పబ్లిక్ సెక్టార్ విషయానికొస్తే ఫోర్త్ సిటీ, ఏఐ సిటీలో పెట్టుబడులు పెట్టనున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంపై నమ్మకం ఉంచి... 'తెలంగాణ రైజింగ్'లో భాగస్వామ్యమయ్యేందుకు ముందుకొచ్చిన వీరికి ప్రత్యేక ధన్యవాదాలు.

కొందరు రాష్ట్రానికి పెట్టుబడులు రావడం లేదు... పరిశ్రమలు తరలి వెళ్లిపోతున్నాయంటూ మా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి వారికి మేం తీసుకొస్తున్న పెట్టుబడులు, ఉద్యోగాలు కనిపించడం లేదా..? ఒక్కసారి ఆలోచించాలని తెలంగాణ ప్రజలను కోరుతున్నా. ఇక్కడి యువత ప్రతిభే

మిగితా 2వ పేజీలో




## పార్లమెంటరీ బృందాలతో ప్రధాని మీటింగ్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

భారత ప్రధాని నరేంద్రమోడీ అఖిలపక్ష ఎంపీలతో భేటీ అయ్యారు. 'ఆపరేషన్ సిందూర్', ఉగ్రవాద నిర్మూలనపై భారత వైఖరిని ప్రపంచ దేశాలకు వివరించి వచ్చిన అఖిలపక్ష పార్లమెంటరీ బృందాల ఎంపీలతో మోదీ భేటీ అయ్యారు. దిల్లీలోని ప్రధాని అధికార నివాసంలో మంగళవారం ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీల బృందం తమ పర్యటన విశేషాలను ప్రధానిక్తి వివరించారు. బీజేపీ ఎంపీలు రవిశంకర్ ప్రసాద్, బైజయంత్ పాండా, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్, శివసేన ఎంపీ శ్రీకాంత్ శిందే, డీఎంకే ఎంపీ కనిమొళి, ఎన్సీపీ(ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే, జేడీ(యూ) ఎంపీ సంజయ్ కుమార్ ఝా నేతృత్వంలోని అఖిలపక్ష పార్లమెంటరీ బృందాలు ఆయా దేశాల్లో పర్యటించి దాయాది దేశం పాకిస్థాన్ తీరును ఎండగట్టారు. మరోవైపు, భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఇప్పటికే ప్రతినిధులను కలిశారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ వైఖరిని తెలియజేశారు. ఈ ప్రయత్నాలను ప్రధాని ప్రశంసించారు.

## చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం..

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో




ప్రపంచవ్యాప్తంగా మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఓపెన్‌ఏఐ చాట్‌బాట్ చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం ఏర్పడింది. దీనివల్ల వేలాది మంది యూజర్లు ఇబ్బంది పడ్డారు. అమెరికా, భారత్‌లో ప్రభావం ఎక్కువగా ఉన్నట్టు డౌన్‌డిటెక్టర్ ప్లాట్‌ఫామ్ వెల్లడించింది. చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయంపై ఒక్క భారత్‌లోనే 800 ఫిర్యాదులు అందాయని ఆ సంస్థ తెలిపింది. తమ సందేహాలకు, ప్రశ్నలకు చాట్‌బాట్ స్పందించ లేదని భారత ఫిర్యాదుదారుల్లో 88 శాతం మంది తెలిపారు. చాట్‌జీపీటీ పనిచేయకపోవడంపై ప్రకటన ఓపెన్‌ఏఐ స్పందించింది.ఈ అంతరాయం ఓపెన్‌ఏఐ అధికారిక గుర్తించాం. ఇది కంపెనీ టెక్స్-టు-వీడియో ప్లాట్‌ఫారమ్ అయిన సోరాపై కూడా ప్రభావం చూపుతోంది. ఈ రెండు ముఖ్యమైన సేవలు ప్రస్తుతం డౌన్‌లో ఉన్నాయి. వీటిపై ఆధారపడే వినియోగదారులకు ఇది నిరాశ కలిగిస్తోందని తెలిపింది.



## స్కూల్‌లో కాల్పులు.. 9 మంది మృతి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఆస్ట్రియాలోని రెండో పెద్ద నగరమైన గ్రాజ్‌లో మంగళవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బోర్గ్ డ్రెయిర్‌షుట్జెన్‌గాస్సే పాఠశాలలో ఓ విద్యార్థి జరిపిన కాల్పుల్లో కనీసం 9 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం నిందితుడైన విద్యార్థి పాఠశాల టాయిలెట్‌లో తనను తాను కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు నగర మేయర్ ఇల్కీ కార్ వెల్లడించారు.

# భారత్ జనాభా రూ. 146 కోట్లు

- ఐరాస అనుబంధ సంస్థ ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



ఈ ఏడాది కూడా జనాభాపరంగా ప్రపంచంలోనే నంబర్ 1 స్థానంలో భారత్ కొనసాగు తోంది ఐరాస అనుబంధ సంస్థ ఐక్యరాజ్య సమితి పాపులేషన్ ఫండ్ పేర్కొంది. ఈ ఏడాది చివరికల్లా జనాభా 146 కోట్లకు చేరుకుంటుదని అంచనా వేసింది. స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ ఎరుతో విడుదల చేసిన నివేదికలో ఈ మేరకు తెలిపింది. అయితే జననాల రేటు నిర్దేశిత స్థాయి కంటే దిగువకు పడిపోయిందని వెల్లడించింది. భారత్‌లో సంతానోత్పత్తి ప్రధాన సమస్యగా ఉందని వివరించింది. ఐరాస నివేదిక ప్రకారం ప్రస్తుతం భారత్‌లో జననాల రేటు 1.9గా ఉంది. ఏ దేశంలోనైనా సగటు 'రీప్లేస్‌మెంట్ రేటు' కనీసం 2.1గా ఉండాలి. కానీ, భారత్‌లో సంతానోత్పత్తి రేటు పడిపోయింది. జననాల రేటు తగ్గిపోయినప్పటికీ భారతదేశ జనాభా సంఖ్య నిలకడగా కొనసాగుతోందని ఐరాస కితాబిచ్చింది. ప్రస్తుతం భారతదేశ జనాభా 146 కోట్ల దరిదాపుల్లో ఉంది. రాబోయే 40 ఏళ్లలో భారత జనాభా 170 కోట్ల గరిష్ఠ స్థాయికి చేరొచ్చు. ఆ తర్వాతి నుంచి జనాభా తగ్గుదల మొదలయ్యే అవకాశం ఉందని ఐరాస విశ్లేషించింది.ప్రపంచ దేశాల్లో సంతా నోత్పత్తి సంక్షోభం ఏర్పడిందని ఐరాస ఆందో ళన వ్యక్తం చేసింది. కుటుంబ నియం త్రణ చర్యలు, గర్భ నిరోధక సాధనాల వినియోగం, లైంగిక ఆరోగ్యం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఎవరికి వారుగా సంతానోత్పత్తి నిర్ణయాలను తీసుకోవాలని నివేదికలో పేర్కొంది. ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజ లు వారి వ్యక్తిగత సంతానోత్పత్తి లక్ష్యాలను గుర్తించలేకపోయారని, జనాభా అంశంలో ప్రస్తుతానికి ఇదే నిజమైన సంక్షోభమని అని ఐరాస హెచ్చరించింది.

# పెంచిన బస్ పాస్ ధరలను ఉపసంహరించుకోవాలి

- ఎమ్మెల్సీ కవిత
- ఆర్టీసీ బస్సు భవన్ ముట్టడికి యత్నం
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



తెలంగాణలో ఆర్టీసీ బస్‌పాస్ ధరలను పెంచి ప్రజలపై గుదిబండను మోపారని, పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్‌పాస్ ధరల పెంపునకు నిరసనగా మంగళవారం ఆమె పెద్ద ఎత్తున జాగతి కార్యకర్తలతో కలిసి బస్ భవన్ ముట్టడికి యత్నించారు. వెంటనే భారీ స్థాయిలో పోలీసులు మోహరించి కవితను బలవంతంగా అరెస్టు చేసి చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించరు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బస్‌పాస్ ధరలను పెంచి ప్రజలపై పెనుబారాన్ని మోపిందన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులపై తీవ్రంగా ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పెంపుతో ఒక్క ప్రయాణికుడిపై నెలకు దాదాపు రూ 300 పైగా భారం పడుతుందని అన్నారు. అనేక రూట్లల్లో విద్యార్థుల కోసం బస్సులు నడపడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వం అలవాటుపడిందన్నారు.పెంచిన బస్ పాస్ ధరలను తగించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో పెద్ద ఎత్తున జాగతి కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతకు ముందు బీఆర్ఎస్‌వీ నేతలు బస్‌భవన్ ఎదుట మెరుపు ధర్నాకు దిగారు. రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ఉద్రిక్తతకు దారితీసింది. బీఆర్ఎస్‌వీ అధ్యక్షుడితో సహా బీఆర్ఎస్‌వీ శ్రేణులు, పలువురిని పోలీసులు అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు. ఆర్టీసీ బస్‌పాస్ చార్జీలు పెంచడం వల్ల పేద విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుందని, ఒక్కో విద్యార్థిపై రూ. 250 నుంచి రూ. 350 వరకు భారం పడుతోందని బీఆర్ఎస్‌వీ నాయకులు తెలిపారు.

# హైకోర్టులో హరీశ్‌రావుకు ఊరట..


బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ హైకోర్టులో మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఊరట లభించింది. ఆయనపై వేసిన ఎన్నికల పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ఎన్నికల అఫిడవిట్‌లో హరీశ్‌రావు సరైన వివరాలు ఇవ్వలేదని గతంలో చక్రధర్ గౌడ్ వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేటలో బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావు, కాంగ్రెస్ నుంచి హరికృష్ణ, బీఎస్పీ నుంచి చక్రధర్ గౌడ్ పోటీ చేశారు. అయితే ఈ ఎన్నికల్లో గెలిచిన హరీశ్‌రావు అఫిడవిట్‌లో పూర్తి సమాచారం వెల్లడించకుండా రహస్యంగా ఉంచారని చక్రధర్ గౌడ్ పిటిషన్ దాఖలు చేశారు. తన కుమారుడి వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై తాజాగా మరోసారి విచారణ చేపట్టిన హైకోర్టు.. దాన్ని కొట్టివేసింది. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఇప్పటికైనా ప్రతిపక్ష నాయకులపై కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టిసారించాలని సూచించారు. అక్రమ కేసులకు భయపడేది లేదని.. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీ నయవంచనను ఎండగట్టి తీరుతామని హెచ్చరించారు. ప్రజల తరపున ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

# పాక్ లో లోతుగా వెళ్లేందుకు మేము సిద్ధం

- భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్,

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, పాకిస్తాన్‌కు గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఉగ్రవాద దాడులకు ప్రతిస్పందనగా, అవసరమైతే పాకిస్తాన్ లోతుల్లోకి ప్రవేశించి దాడులు చేయడానికి భారత్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఇది ఇటీవల భారతదేశం చేపట్టిన "ఆపరేషన్ సిందూర్" తరహా దాడుల తరువాత ఆయన చేసిన కీలక వ్యాఖ్య. బ్రస్సెల్స్‌లోని యూరోపియన్ యూనియన్ వాణిజ్య చర్చల సందర్భంలో పోలిటికోకి ఇచ్చిన ఇంటర్వ్యూలో జైశంకర్ మాట్లాడుతూ: "వారు పాకిస్తాన్ లో లోతుగా ఉంటే, మేమూ లోతుగా వెళ్లతాము," అని స్పష్టం చేశారు.

ఈ వ్యాఖ్యలు ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయక ప్రజలు హతమవడంతో ఏర్పడిన ఉద్రిక్తతల తర్వాత వచ్చాయి. ఆ దాడికి ప్రతిగా భారత వాయుసేన మే 7న పాక్ మరియు పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని ఉగ్ర స్థావరాలపై "ఆపరేషన్ సిందూర్" కింద ఖచ్చితమైన దాడులు నిర్వహించింది.

పాకిస్తాన్ ప్రభుత్వ విధానంలో ఉగ్రవాదం ఓ సాధనంగా మారింది" అని జైశంకర్ ఆరోపించారు. పాక్ వేలాది ఉగ్రవాదులను శిక్షణ ఇస్తోందని, వారిని భారత్‌లోకి చొరబాటుకు పంపిస్తోందని తెలిపారు.

"మేము అలాంటి చర్యలను భరించం. ఉగ్రవాద సంస్థలు, వారి నాయకత్వంపై కచ్చితంగా ప్రతీకారం ఉంటుంది," అని జైశంకర్ హెచ్చరించారు. మే 10న భారత్ చేసిన వైమానిక దాడుల ప్రభావం గూర్చి ఆయన వివరించారు: "దుర్మార్గాన్ని ఆపిన కారణం - మేము మే 10న పాక్ వైపు ఉన్న ముఖ్యమైన 8 ఎయిర్‌ఫీల్డ్‌లను ధ్వంసం చేయడమే," అని చెప్పారు. గూగుల్ శాటిలైట్ చిత్రాల ద్వారా పాక్ ఎయిర్‌బేస్‌లపై జరిగిన నష్టం స్పష్టంగా కనిపించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల తరువాత రెండు దేశాలు పరస్పర అవగాహనకు వచ్చాయి, తద్వారా నాలుగు రోజుల సైనిక ఘర్షణ ముగిసింది.

## నేడు కాళేశ్వరం కమిషన్ విచారణకు కేసీఆర్

బలగం టీవీ, హైదరాబాద్

కాళేశ్వరం కమిషన్ విచారణకు బుధవారం మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరు కానున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వేసిన పీసీ ఘోష్ కమిషన్ విచారణకు హాజరు కావాలని ఆయనకు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిషన్ విచారణ హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో జరగనున్నది. కాగా కేసీఆర్ బుధవారం ఉదయం 11.30 గంటలకు విచారణకు హాజరు కానున్నారు. ఇప్పటికే కాళేశ్వరం కమిషన్ విచారణకు మాజీ మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్ రావు హాజరైన సంగతి తెలిసిందే.

## చెట్టు విరిగిపడి లైన్ ఇన్‌స్పెక్టర్ మృతి

బలగం టీవీ, హైదరాబాద్

భారీగా గాలులు వీస్తూ వర్షం కురిసిన సమయంలో రేకుల షెడ్డు కింద నిలబడిన విద్యుత్‌శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ చెట్టు విరిగిపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్‌లో జరిగింది. విద్యుత్‌శాఖ బోర్గాం(పి) సెక్షన్‌లో పని చేస్తున్న ఏ.శ్రీనివాస్(48).. సోమవారం రాత్రి వేగంగా గాలులు వీస్తూ వర్షం కురవడంతో.. రేకులషెడ్డు కింద నిలుచున్నాడు. గాలుల తీవ్రతకు పక్కనే ఉన్న చెట్టు విరిగి రేకులషెడ్డుపై పడింది. దాని కింద ఉన్న శ్రీనివాస్ అక్కడికక్కడే చనిపోయాడు.

## స్కూళ్లకు అకాడమిక్ క్యాలెండర్ విడుదల..

బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్రంలో జూన్ 12 నుంచి పాఠశాలలు పున: ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యా శాఖ అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో విద్యా శాఖ అకడమిక్? క్యాలెండర్‌ను విడుదల చేసింది. 2025–26 విద్యా సంవత్సరంలో పరీక్షలు, సెలవుల తేదీలను వెల్లడించింది. ఈ మేరకు అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. 2025 – 26 విద్యా సంవత్సరంలో స్కూళ్లకు 230 వర్కింగ్ డేస్ ఉంటాయని తెలిపింది. 2025, జూన్ 12న క్లాసులు ప్రారంభం కానుండగా 2026, ఏప్రిల్ 23న లాస్ట్ వర్కింగ్ డేగా పేర్కొంది. జూన్ 11 వరకు వేసవి సెలవులు ఉండనున్నాయి. ఎస్ఏ 1 పరీక్షలు అక్టోబర్ 24 – 31 వరకు, ఎస్ఏ 2 ఏప్రిల్ 10 – 18 వరకు ఉంటాయి. మధ్య మధ్యలో ఫార్మెటివ్ అసెస్‌మెంట్ ఎగ్జామ్స్ ఉంటాయి. దసరాకు సెప్టెంబర్ 21 – అక్టోబర్ 3 వరకు, క్రిస్మస్‌కు డిసెంబర్ 23 – 27 వరకు, సంక్రాంతికి జనవరి 11 – 15 వరకు సెలవులు ఉండనున్నాయి. విద్యార్థులకు సకాలంలో సిలబస్ పూర్తి చేసేలా పాఠశాల ప్రారంభం నుంచే చర్యలు చేపట్టాలని విద్యాశాఖ ఆదేశించింది. టెన్త్ విద్యార్థులకు 2026 జనవరి 10లోపు సిలబస్ పూర్తి చేయాలని పేర్కొంది. అప్పటి నుంచి ప్రీ ఫైనల్ ఎగ్జామ్స్? వరకు రివిజన్? చేపట్టాలని సూచించింది. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు 2026 ఫిబ్రవరి 28లోగా సిలబస్? పూర్తి చేయాలని ఆదేశించింది. ఈ నెల 6 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించింది.

## ఓటర్లకు అందుబాటులో పోలింగ్ కేంద్రాలు

**సీఈవో సుదర్శన్**

బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్రంలో ఓటర్లకు పోలింగ్ కేంద్రాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు ఎన్నికల అధికారులను ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ ఆదేశించారు. ఎక్కువ మంది ఓటర్లు ఉన్న పోలింగ్ బూత్‌లను విడగొట్టి కొత్త పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. కుటుంబ సభ్యులందరికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే సదుపాయం కల్పించాలన్నారు. ఓటర్ ఐడీలో మార్పులు, చేర్పుల విషయంలో ప్రజలకు బీఎల్ఓలు సహకరించాలన్నారు.

## తొక్కిసలాట ఘటనపై విచారణ 12కి వాయిదా

బలగం టీవీ, హైదరాబాద్

బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటనపై విచారణను కర్ణాటక హైకోర్టు ఈ నెల 12కి వాయిదా వేసింది. తమపై నమోదైన క్రిమినల్ కేసును కొట్టివేయాలని కోరుతూ రాయల్ ఛాలెంజ్ బెంగళూరు (ఆర్‌సిబి) సోమవారం హైకోర్టును ఆశ్రయించింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి వి.కామేశ్వర రావు, న్యాయమూర్తి సి.ఎం.జోషి విచారణ జరిపారు. ఈ సందర్భంగా కోర్టు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి కొంత సమయం కావాలని ప్రభుత్వం కోరింది. దీంతో సీల్డ్ కవర్‌లో సమాధానం దాఖలు చేయాలని అడ్వకేట్ జనరల్ (ఎజి) శశికిరణ్ శెట్టిని కోర్టు ఆదేశించింది. మంగళవారం విచారణ సందర్భంగా ఈ ఘటనపై ప్రభుత్వం ఇంకా సమాధానం దాఖలు చేయలేదని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. విచారణ కోసం జ్యుడీషియల్ కమిటీని నియమించామని, ఒక నెలలోగా రిపోర్ట్ సమర్పించాల్సిందిగా ఆదేశించామని చెప్పారు. పోలీస్ అధికారులను కూడా సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ నెల 4న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటలో 11మంది మరణించిన సంగతి తెలిసిందే. 5వ తేదీన కర్ణాటక హైకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించింది. ఈ ఘటనపై సమగ్ర నివేదికను దాఖలు చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.

## 13న ముగ్గురు మంత్రుల రాక

బలగం టీవీ, హైదరాబాద్

ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు మంజూరైన పోలీస్ స్టేషన్లను ఈనెల 13న రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు ప్రారంభించనున్నారు. నూతనంగా మంజూరైన పెద్దపల్లి మహిళా పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, రూరల్ పోలీస్ స్టేషన్ తో పాటు ఎలిగేడు పోలీస్ స్టేషన్ ను మంత్రులు ప్రారంభించనున్నారు. దీంతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు అందించనున్నారు. మంత్రుల పర్యటన ఖరారైందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అధికారులకు తెలియజేయడంతో ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

## దేశాన్ని ఐక్యంగా నిలబెట్టడంలో హిందీది ప్రధాన పాత్ర

**రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ**

బలగం టీవీ, హైదరాబాద్



దేశాన్ని ఐక్యంగా నిలబెట్టడంలో హిందీ ప్రధాన పాత్ర పోషిస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని హిందీ భాషాభివృద్ధికి భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు విశేష కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కోరారు. సామాజిక మాధ్యమాలు, ఇంటర్నెట్, ఫోన్లు తదితర సమాచార వ్యవస్థ లేని రోజుల్లో హిందీ ప్రచార సభ హైదరాబాద్ సంస్థను స్థాపించి 90 ఏండ్లుగా విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడం విశేషమన్నారు. హిందీ ప్రచార సభ హైదరాబాద్ 90వ వార్షికోత్సవాలను మంగళవారం హైదరాబాద్ నాంపల్లి స్టేషన్ రోడ్డులోని సంస్థ ప్రాంగణంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ భారతదేశంలో విభిన్న భాషలు, సంస్కృతి, సాంప్రదాయాలు ఉన్నాయని వీటన్నింటినీ హిందీ భాష ఐక్యంగా ముందుకు తీసుకెళ్తున్నదని చెప్పారు. హైదరాబాద్ లాంటి ప్రధాన నగరాలతో పాటు ఆదివాసీలు ఉండే ప్రాంతాల్లో, ఈశాన్య రాష్ట్రాల్లో సైతం హిందీ చక్కగా మాట్లాడుతుండడం శుభ పరిణామమన్నారు. ఒకప్పుడు ప్రజలకు హిందీని చేరువ చేయడం కష్టతరంగా ఉండేదని, సమాచార వ్యవస్థ విస్తృతంగా మారిన నేపథ్యంలో సులువుగా చేరువ చేయవచ్చని, ఈ కృషిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఇతర భాషలను నేర్చుకుంటూ... గౌరవిస్తూనే హిందీ భాషను ముందుకు తీసుకెళ్లాలన్నారు. అంకితభావం, చిత్తశుద్ధి ఉంటే విజయం సాధించవచ్చని, దీనికి హిందీ ప్రచార సభ హైదరాబాద్ నిదర్శనమని కొనియాడారు. సెంట్రల్ హిందీ డైరెక్టర్ సునీల్ బాబురావు కులకర్ణి మాట్లాడుతూ దేశ స్వతంత్ర పోరాటంలో హిందీ విశేష పాత్ర పోషించిందని గుర్తు చేశారు. సంస్థ ఎంతో మందికి హిందీ నేర్పించడంతో పాటు అనేక మందిని హిందీ అధ్యాపకులుగా, ఉపాధ్యాయులుగా, ప్రొఫెసర్లుగా తీర్చిదిద్దిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా హిందీ భాషాభివృద్ధికి కృషి చేస్తున్న పలువురికి విశిష్ట ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. అదే విధంగా హిందీ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. హిందీ ప్రచార సభ హైదరాబాద్ అధ్యక్షుడు ప్రొఫెసర్ చంద్రకాంత్ కావడే అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి ఎస్. గైబువల్లి, ప్రొఫెసర్ సురేష్ పురి, శశికాంత్ భారతి, రమాదేవి, గిరిధర్ రావు, కే.రామచందర్, ఏకే రాజు, మహేశ్వరి, విభా భారతి, సుష్మా దేవి తదితరులు పాల్గొన్నారు.

## సినిమా షూటింగ్‌లకు ఇకపై సింగిల్ విండోలోనే అనుమతులు

**తెలంగాణ ప్రభుత్వ కీలక నిర్ణయం**

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి సినీ నగరంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తును ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని అధికారులను కేబినెట్ ఉపసంఘం ఆదేశించింది. మంగళవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, డి. శ్రీధర్‌బాబులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీ సినీరంగ ప్రముఖులు, అధికారులతో సమావేశమై కీలక అంశాలపై చర్చించింది. జాతీయ, అంతర్జాతీయ సినీ పరిశ్రమలను ఆకర్షించేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని కేబినెట్ సబ్ కమిటీ అభిప్రాయపడింది. సినిమా షూటింగ్‌లకు అవసరమైన పోలీస్, ఫైర్, మున్సిపాలిటీ వంటి వివిధ శాఖల అనుమతులన్నీ ఒకేచోట, సింగిల్ విండో పద్ధతిలో లభించేలా చూడాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. ఈ అనుమతుల ప్రక్రియను సులభతరం చేసేందుకు ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో (ఎఫ్‌డీసీ) ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు.

సినిమా థియేటర్లలో తినుబండారాల ధరలను కచ్చితంగా నియంత్రించాలని ఉప ముఖ్యమంత్రి, మంత్రులు అధికారులకు స్పష్టం చేశారు. అధిక ధరలకు విక్రయించడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

గతంలో ప్రభుత్వం ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు కేటాయించిన 50 ఎకరాల భూమిలో నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో వివరించాలని కేబినెట్ సబ్ కమిటీ అధికారులను కోరింది. అలాగే, సినీ కార్మికుల కోసం నిర్మించిన చిత్రపురి కాలనీ సమస్యలపై ఏర్పాటు చేసిన కమిటీని తదుపరి సమావేశానికి పిలిపించాలని నిర్ణయించారు.

## టెక్నాలజీ రెండు వైపులా పదునున్న కత్తి

**సాంకేతికతపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ కీలక వ్యాఖ్యలు**

బలగం టీవీ, హైదరాబాద్



సాంకేతికత (టెక్నాలజీ) రెండు వైపులా పదును ఉన్న కత్తి అని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అభిప్రాయపడ్డారు. టెక్నాలజీని న్యాయ నిర్ణయాలు తీసుకోవడానికి ఉపయోగించకూడదని, విధులను మెరుగుపరచడానికి వాడాలని తెలిపారు. భారత్ వంటి విస్తారమైన, వైవిధ్యమైన, సంక్లిష్టమైన దేశంలో న్యాయం పొందే అవకాశాన్ని పెంచడంలో సాంకేతికత ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. యూకేలోని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో జరిగిన 'న్యాయం పొందే అవకాశాన్ని మెరుగుపరచడంలో సాంకేతికత పాత్ర' అనే అంశంపై జస్టిస్ బీఆర్ గవాయ్ మాట్లాడారు.

"న్యాయాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావాలనే తపనతో భారత్?లోని న్యాయవ్యవస్థ సాంకేతికతను సులభంగా సమగ్రపరచింది. సాంకేతికత రెండు వైపులా పదును ఉన్న కత్తిలా పనిచేస్తుంది. ఇది అసమానమైన విభజనలకు కూడా దారితీస్తుందని మనం అంగీకరించాలి. ఇంటర్నెట్ కనెక్టివిటీ, డివైజ్?లు, డిజిటల్ అక్షరాస్యతకు ఇప్పటికే న్యాయం కోసం ఎదురుచూస్తున్న అణగారిన వర్గాలను మినహాయించడానికి దారితీస్తుంది. అయితే విధానపరమైన లోపాలు లేకుండా న్యాయ నిర్ణయాల్లో ఎటువంటి విప్లవం సాధించలేం. సాంకేతికత, మధ్యవర్తిత్వ నిర్ణయాలకు మానవ పర్యవేక్షణ, పారదర్శకత, జవాబుదారీతనం నిర్ధారించే పాలనా చట్రాలను అభివృద్ధి చేయాలి. "

భారత్?లో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారని, 121 కంటే ఎక్కువ మాతృభాషల్లో మాట్లాడుతున్నారని జస్టిస్ బీఆర్ గవాయ్ తెలిపారు. అలాంటి దేశంలో కోర్టులకు సమానమైన ప్రాప్యతను నిర్ధారించడం రాజ్యాంగం బాధ్యత, నైతిక ఆవశ్యకత అని అన్నారు. ఆర్టికల్ 32, 226లు పౌరులు తమ హక్కుల రక్షణ కోసం సుప్రీంకోర్టు, హైకోర్టులను నేరుగా ఆశ్రయించడానికి అధికారం ఇస్తాయని పేర్కొన్నారు. రాజ్యాంగ నియమాలు, పౌరుల ప్రత్యక్ష అనుభవాల మధ్య సాంకేతికత వారధిగా మారిందని చెప్పారు.

"వీడియో కాన్ఫరెన్సింగ్ కోర్టులలో శాశ్వత స్థిరాంకంగా మారింది. ఎందుకంటే ఇది మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన న్యాయవాదులు ఖరీదైన, ఎక్కువ సమయం ప్రయాణం కోసం వృథా చేయకుండా సుప్రీంకోర్టు ముందు కేసులను వాదించడానికి వీలు కల్పించింది. న్యాయం పొందేందుకు ఉన్న అడ్డంకులు ఇప్పుడు టెక్నాలజీ సాయంతో తగ్గిపోతున్నాయి. వీడియో కాన్ఫరెన్సింగ్ టెక్నాలజీ కోర్టుకు అందుబాటులో ఉంది. బీహార్, మహారాష్ట్ర గ్రామీణ ప్రాంతాల్లో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది ఇప్పుడు ఢిల్లీ వచ్చేందుకు ఎక్కువ డబ్బులు, సమయం కేటాయించే అవసరం లేకుండా సుప్రీంకోర్టు ముందు హాజరు కావచ్చు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాక్ష్యులు ఎటువంటి భయంలేకుండా సాక్ష్యం చెప్పొచ్చు." అని బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు.

# వేములవాడను అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నాం..

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, వేములవాడ**



ఇందిరమ్మ రాజ్యంలో ఈ ప్రాంత ప్రజల ఆలోచనలకనుగుణంగా వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని,గెలిచిన మొదటి 10 మాసాల్లో సుమారు 1000 కోట్లతో అభివృద్ధి పనులు శంకుస్థాపన చేసామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.మంగళవారం వేములవాడ పట్టణంలో 7,8,11,12 వార్డులల్లో పలు, సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్,పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ ఆది ఆది శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో మూడు కోట్ల పై చిలుకు నిధులతో 28 వార్డుల్లో ప్రజలు చెప్పిన ప్రాంతాల్లో సీసీ రోడ్లు సైడు డ్రైన్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. వేములవాడ పట్టణ, రాజన్న ఆలయ అభివృద్ధి రెండు కళ్ళల ముందుకు పోతున్నామని, ఎన్నికల ముందు వేములవాడను టెంపుల్ సిటీగా మార్చుతామని చెప్పిన మాటకు కట్టుబడి ప్రణాళికలు రూపొందించుకుంటూ ముందుకు పోతున్నామని అన్నారు.ఆనాటి ప్రభుత్వం రాజన్న ఆలయ అభివృద్ధి పట్టణ అభివృద్ధి పై ఇచ్చిన మాటను తప్పిందని,అనాడు కేసీఆర్ రాజన్న ఆలయంలో నా లగ్గం అయిందని చెప్పి, రాజన్న ఆలయ అభివృద్ధి చేస్తానని చెప్పి రాజన్నకే సెటగోపం పెట్టాడని అన్నారు. గుడి చెరువులోకి మూలవాగులోకి వెళ్లే మురుగు నీటిని మళ్లించడానికి ఇంచు మించు 9 కోట్లు నిధులతో ప్రణాళిక రూపొందించడం జరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభం చేస్తామని అన్నారు.

గత ప్రభుత్వం రంగురంగుల బ్రోచర్లలో మూడవ బ్రిడ్జి నిర్మాణం, ఆలయ అభివృద్ధిని వీడియోలలో చూపెట్టారు కానీ క్షేత్రస్థాయిలో అమలు చేయలేరని అన్నారు.కొందరు మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం కోసం భూమి పూజ చేసారు అని, భూమి పూజ చేసిన పనులు ప్రారంభం కాలేదని,వారి హయాంలో భూమి పూజ చేసి పది సంవత్సరాలైనా పనులు చేయ లేదని అన్నారు. భూమి పూజ చేసిన రోజు బ్రిడ్జి ఇరువైపుల నిర్వాసితులకు వచ్చి గత ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వలేదని వాపోయారని, తీరా ఫైల్ చూస్తే పరిహారం కూడ వారికి గత ప్రభుత్వం ఇవ్వలేదని అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి నష్టపరిహారం తీసుకువచ్చి కలెక్టర్ ఖాతాలో జమ చేయడం జరిగిందని అన్నారు. వర్షాకాలంలో బ్రిడ్జి నిర్మాణం మొదలుపెడితే సాంకేతికంగా ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారని అన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధికి 76 కోట్ల నిధులు కేటాయించినామని, త్వరలోనే టెండర్ ప్రక్రియ కానుందని అన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధిపై ఇప్పటికే నాలుగు సార్లు శృంగేరి వెళ్లి పీఠాధిపతి అనుమతి తీసుకొని రావడం జరిగిందని అన్నారు. పట్టణ ప్రముఖులు, పరిరక్షణ సమితి సభ్యులు అందరి ఆలోచనలు సలహాలు సూచనలు తీసుకొని అభివృద్ధిలో ముందుకు పోతున్నామని అన్నారు. ఇప్పటికే 24 బడ్జెట్లో 50 కోట్లు 2025-26 బడ్జెట్లో 100 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం జరిగిందని అన్నారు.వేములవాడ పట్టణాన్ని అభివృద్ధి చేయడానికి అనేక రూపకల్పనలు చేయడం జరిగిందని అన్నారు. మాకంటూ ప్రత్యేక ఎజెండా ఏమీ లేదని, ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే మా ఏజెండా అని అన్నారు. ఈ కార్యక్రమంలో హాజరైన మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్,వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మాజీ కౌన్సిలర్ లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి పత్రాలు లేని ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

**బలగం టీవీ, బోయినిపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలో ట్రాక్టర్ తో అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారని రెవెన్యూ ఇన్స్పెక్టర్ మనోజ్ కు సమాచారం అందడంతో హుటాహుటిన గ్రామంలో తన సిబ్బందితో ఇసుక ట్రాక్టర్ ను పట్టుకొని పత్రాలను అడగగా ఓనర్ ఎలాంటి అనుమతి పత్రాలు చూపించకపోవడంతో ఇసుక ట్రాక్టర్ ను మండల తాహశీల్దార్ కార్యాలయానికి పంపించి జరిమానా విధించినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మనోజ్ తెలిపారు.



## సింగరేణి అలియాస్ పేర్ల బాధితులకు డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వాలి..

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్**

**బలగం టీవీ, హైదరాబాద్**

సింగరేణిలో మారు పేర్ల (అలియాస్ నేమ్స్) తో కార్మికులుగా పని చేసి డిపెండెంట్ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న బాధితులను ఆదుకోవాలని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ లోని తన నివాసంలో సింగరేణి జాగృతి నాయకులు, అలియాస్ నేమ్స్ డిపెండెంట్ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, సంస్థలో 30 ఏళ్లకు పైగా సేవ చేసిన కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా వేధింపులకు గురి చేయడం అన్యాయమన్నారు. తండ్రులు అలియాస్ నేమ్స్ తో పని చేస్తే వారసులకు రెండు ఇంటి పేర్లు ఉన్నాయనే కారణంతో ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. అలియాస్ నేమ్స్ డిపెండెంట్ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారిని విజిలెన్స్ విభాగం ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెడుతోందని అన్నారు. సింగరేణిలో అలియాస్ నేమ్స్ తో డిపెండెంట్ ఉద్యోగాల కోసం వందలాది మంది ఎదురు చూస్తున్నారని తెలిపారు. యాజమాన్యం మానవత దృక్పథంతో వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి సింగరేణి యాజమాన్యం, జాతీయ కార్మిక సంఘాలు లేబర్ కమిషనర్ వద్ద చేసుకున్న ఒప్పందం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత సూచన మేరకు సింగరేణి జాగృతి నాయకులు సంస్థ జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ సుభాని గారిని కలిసి వినతిపత్రం అందజేశారు. సమావేశంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన చారి, తెలంగాణ జాగృతి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ నరేన్ అప్పల, టీబీజీకేఎస్ కేంద్ర కోశాధికారి వెంకట్, సింగరేణి జాగృతి నాయకులు నరేష్ నేత, భువనచంద్ర, అనిల్ సందీప్ గౌడ్, సునీల్, శ్రీకాంత్ మరియు మారుపేరు బాధితులు లక్క శ్రావణ్ గౌడ్, పుట్ట సత్యం, వేముల సాయికుమార్, బొద్దుల రంజిత్ కుమార్, వేగోలం అరుణ్ కుమార్ , జక్కుల శ్రావణ్, డిష్ బాబు, తిరుమల శ్రీనివాస్, కన్నాల రాజం, వంగ సంతోష్ , పొన్నం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు



## యూత్ కార్యవర్గం ఎన్నిక

**బలగం టీవీ, తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం మండేపల్లి గ్రామంలోని మల్లికార్జున యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులు ముద్దాల పర్శరాములు, ఉపాధ్యక్షులుబండి కృష్ణ బాబు, ప్రధాన కార్యదర్శి అమరగొండ ప్రశాంత్, కోశాధికారి పెంటల అభిశాంత్,కార్యదర్శి గుంటి అజేయ్,ఒగ్గు దేవయ్య సలహాదారులు అమరగొండ కృష్ణప్రసాద్,ఒగ్గు కనకయ్య, మాసురి మహేష్ లు ఎన్నికయ్యారు.

## బడిబాట కార్యక్రమం

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మల్కాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా యువజన సంఘాల అధ్యక్షులు అమీర్ శెట్టి భూమిరెడ్డి, మాజీ విద్యా కమిటీ చైర్మన్ మరియు ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి ఉపాధ్యాయులు రాములు, తిరుపతి రెడ్డి, అంగన్వాడి టీచర్ కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.




## మారుపాక కృష్ణకు గిడుగు రామమూర్తి జాతీయ పురస్కారం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం 2025 గాను గిడుగు రామమూర్తి జాతీయ పురస్కారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవనంలో అతిథిగా విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ రాధా రాణి, తెలంగాణ కళారత్న బిక్కి కృష్ణ, గిడుగు రామమూర్తి సంస్థ ఫౌండేషన్ దివాకర్ బాబు, కాంతి కృష్ణ అధ్యక్షుడు, సినిమా రచయిత డాక్టర్ సరళ, విశ్వపుత్రిక గజల్ డాక్టర్ విజయలక్ష్మి పండిత్‌ల చేతుల మీదుగా మారుపాక కృష్ణ కు అందించారు. ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి..



**-కష్టపడ్డ ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు లభిస్తుంది**

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలనీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌అన్నారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని ఎస్ ఆర్ ఆర్ గ్రాండ్ లో జరిగిన వేములవాడ నియోజకవర్గం సోషల్ మీడియా సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గత ఎన్నికల్లో వేములవాడ ఎమ్మెల్యేగా గెలవడంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వారియర్స్ ల పాత్ర మరువలేనిదనీ,అనాడు పిసిసి అధ్యక్షునిగా రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ ప్రభుత్వం పై ,దొరల పాలనకు చరమ గీతం పడండి అని చెప్పిన సందేశాన్ని గ్రామ గ్రామాన ప్రతి ఒక్కరికీ చెరవేసింది సోషల్ మీడియా వారియర్స్ అని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ మందుకు పోతున్న సందర్భంగా ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజలకు సోషల్ మీడియా వారియర్స్ చెరవేయాలన్నారు..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్శిటీలు తెరిస్తే బిఆర్ఎస్ పార్టీ దుబాయ్ కేంద్రంగా వాట్స్ అప్ యూనివర్సిటీలను తెరిచి ప్రభుత్వం పై ఆరోపణలు చేస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వం పై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఏప్పటికప్పుడు తిప్పికొట్టాలనిఅన్నారు.. కష్టపడ్డవారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని,దానికి నిదర్శనమే సోషల్ మీడియా వారియర్స్ గా ఉన్న వారికి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లుగా నియమించడం జరిగిందన్నారు.. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ బొజ్జ మల్లేష్, జిల్లా కోకన్వీనర్ కనికరపు రాకేష్, వేములవాడ పట్టణ కన్వీనర్ ఎర్ర శ్రావణ్, వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు న్యాత నవీన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు,పలు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,అన్ని మండలాల కోఆర్డినేటర్లు, గ్రామ శాఖ కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు...

## బీఆర్ఎస్ సీనియర్ నాయకుల జన్మదిన వేడుకలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



జిల్లాకు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జక్కుల నాగరాజ్ యాదవ్, కొమ్ము బాలయ్య, జక్కుల రవి ల జన్మదిన వేడుకలు తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తోట ఆగన్న, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కేటీఆర్ పీఏ దాసరి గాన్రాజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముగ్గురు సీనియర్ నాయకులను శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంబాల మల్లారెడ్డి, ఎల్లారెడ్డిపేట మండల ఫ్యాక్స్ చైర్మన్, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు, వేణుగోపాలరావుతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు విజేందర్ రెడ్డి, భాస్కర్, పడిగల రాజు, మహేష్, అమర్ రావు, ప్రేమ్, చంటి తదితరులు పాల్గొన్నారు.

# షూటింగ్ వరల్డ్ కప్‌లో భారత్‌కు కాంస్యం

**బలగం టీవీ, హైదరాబాద్**



ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో భారత యువ షూటర్ ఎలవేనిల్ వలరివన్ కాంస్యం సాధించింది. మంగళవారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పిస్టల్ ఫైనల్లో 231.2 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. తమిళనాడుకు చెందిన ఎలవేనిల్ వలరివన్ 2018 వరల్డ్ కప్‌లో నాలుగో స్థానంతో నిరాశపరిచింది. అయితే.. మ్యూనిచ్ ఆతిథ్యం ఇస్తున్న ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో మాత్రం అంచనాలకు మించి రాణిస్తోంది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో సత్తా చాటిన తను ఫైనల్లో తొలి షాట్‌లోనే 10.7 పాయింట్లు సాధించింది. ఆ తర్వాత 10.8 పాయింట్లు రాబట్టింది. దాంతో, రజతం వస్తుందని ఆశించింది. కానీ, కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే.. రెండుసార్లు ఒలింపిక్స్‌లో పోటీ పడిన వలరివన్ .. కొరియా షూటర్ క్వాన్ యుంజీ కంటే 0.3 పాయింట్లు మాత్రమే వెనకబడింది. లేదంటే ఆమె ఖాతాలో సిల్వర్ మెడల్ చేరేది. ఫైనల్లో చైనీస్ షూటర్ వాంగ్ జీఫీ పసిడి పతకం గెలుపొందగా.. క్వాన్‌ను రజతం వరించింది.

# అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన నికోలస్ పూరన్

**బలగం టీవీ, హైదరాబాద్**



వెస్టిండీస్ విధ్వంసకర బ్యాటర్ నికోలస్ పూరన్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. కేవలం 29 ఏళ్ల వయసులోనే ఆయన తీసుకున్న ఈ నిర్ణయం అభిమానులను, క్రీడా విశ్లేషకులను ఆశ్చర్యానికి గురిచేసింది. తన నిర్ణయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. వెస్టిండీస్ తరపున 61 వన్డేల్లో 1,983 పరుగులు.. 106 టీ20ల్లో 2,275 పరుగులు చేశాడీ పించ్ హిట్టర్. అంతర్జాతీయ క్రికెట్‌లోకి 2016లో అరంగేట్రం చేశాడు పూరన్. పాకిస్థాన్‌తో జరిగిన టీ20 సిరీస్‌తో డెబ్యూ చేశాడు. పొట్టి ఫార్మాట్‌లో అదరగొడుతుండటంతో 2019లో వన్డేల్లోకి ఎంట్రీ ఇచ్చే అవకాశం దక్కించుకున్నాడు పూరన్. 9 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో ధనాధన్ ఇన్నింగ్స్‌లు ఆడాడు. అయితే హఠాత్తుగా అతడు రిటైర్‌మెంట్ ప్రకటించడంతో అభిమానులు షాక్ అవుతున్నారు. ఇటీవల విండీస్ టీ20 టీమ్‌కు కెప్టెన్‌గా కూడా వ్యవహరించిన ఆటగాడు.. ఇలా హఠాత్తుగా తప్పుకోవడం ఏంటని విస్మయానికి లోనవుతున్నారు. వచ్చే సంవత్సరం జరిగే టీ20 వరల్డ్ కప్‌నకు 8 నెలల ముందు రిటైర్‌మెంట్ ప్రకటించడం ఏంటని ఆశ్చర్యపోతున్నారు. కాగా, ఎంతో ఆలోచించే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని ఇన్‌స్టా పోస్ట్‌లో రాసుకొచ్చాడు పూరన్. ఇన్నాళ్లూ తనకు సహకరించిన కుటుంబ సభ్యులు, విండీస్ బోర్డు, అభిమానులకు అతడు ధన్యవాదాలు తెలిపాడు. ఈ ఆట తనకు ఎన్నో మర్చిపోలేని తీపి జ్ఞాపకాలను ఇచ్చిందన్నాడు పూరన్. విండీస్ కోసం బరిలోకి దిగిన ప్రతిసారి బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చేందుకు శాయశక్తులా ప్రయత్నించానని తెలిపాడు.

# అశ్విన్‌కు భారీ జరిమానా

**బలగం టీవీ, హైదరాబాద్**



తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో వివాదాస్పద అంపైర్‌తో తీవ్రంగా వాగ్వాదానికి దిగిన టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌కు భారీ జరిమానా విధించారు. మ్యాచ్ ఫీజులో 30 శాతం కోత విధిస్తూ మ్యాచ్ రిఫరీ నిర్ణయం తీసుకున్నారు. అంపైర్ల నిర్ణయంపై అసమ్మతి వ్యక్తం చేసినందుకు 10 శాతం, పరికరాలను (బ్యాట్, గ్లోవ్స్) దుర్వినియోగం చేసినందుకు 20 శాతం చొప్పున ఈ జరిమానా విధించినట్లు టీఎన్‌పీఎల్ అధికారులు తెలిపారు.

అశ్విన్ ప్రస్తుతం 2025 తమిళనాడు ప్రీమియర్ లీగ్ టోర్నీలో ఆడుతున్నాడు. ఇందులో అశ్విన్ దుండిగల్ డ్రాగన్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. టోర్నీలో భాగంగా సోమవారం దుండిగల్ డ్రాగన్స్ – ఐడ్రీమ్ తిరుప్పూర్ తమిజాన్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో సాయి కిషోర్ బౌలింగ్‌లో అశ్విన్ స్వీప్ షాట్ ఆడబోయి బంతిని మిస్ అయ్యాడు. బంతి అతని ప్యాడ్స్‌కు తగలడంతో తిరుప్పూర్ ఆటగాళ్లు ఎల్బీడబ్ల్యూ కోసం అప్పీల్ చేశారు. ఆన్–ఫీల్డ్ అంపైర్ క్రితికా అశ్విన్‌ను ఔట్‌గా ప్రకటించారు. లెగ్ స్టంప్ ఆవల బంతి పిచ్ అయినట్లు రిప్లేలో స్పష్టంగా కనిపించింది. అయితే అశ్విన్, శివమ్ సింగ్ తొలి ఓవర్లోనే రెండు రివ్యూలు వాడేయడంతో, సమీక్ష తీసుకోడానికి ఛాన్స్ లేకుండా పోయింది. దీంతో తనను ఔటివ్వడంతో అశ్విన్‌కు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. అంపైర్ వద్ద వాదించినా ఫలితం లేకపోయింది. మైదానాన్ని వీడుతూ సహనం కోల్పోయిన అశ్విన్, బ్యాట్‌ను బలంగా తన ప్యాడ్లపై కొట్టుకున్నాడు. బౌండరీ లైన్ దగ్గరికి రాగానే గ్యాలరీలోకి గ్లోవ్‌ను విసిరికొట్టాడు. అశ్విన్ దురుసు ప్రవర్తనపై టీఎన్‌పీఎల్ తాజాగా చర్యలు తీసుకుంది.

# నేడే టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్

- ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య పోరు
- విజేతకు రూ. 30.83 కోట్ల ప్రైజ్‌మనీ



**బలగం టీవీ, హైదరాబాద్**

2025 వరల్డ్ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్‌కు అంతా సిద్ధం అయ్యింది. లార్డ్స్ వేదికగా జూన్ 11న ఫైనల్ పోరు మొదలు కానుంది. వరుసగా రెండోసారి డబ్ల్యూటీసీ టైటిల్‌పై ఆసీస్ కన్నేయగా, దశాబ్దాల తర్వాత ఐసీసీ ట్రోఫీ నిరిక్షణకు తెర దించాలని సౌతాఫ్రికా భావిస్తోంది. ఈ టైటిల్ ఫైట్ కోసం ఇరు జట్లు తమ తుది జట్లను ప్రకటించాయి.

లండన్‌లోని చారిత్రాత్మక లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్‌లో నేటి నుంచి ఈ నెల 15 వరకు ఈ మెగా ఫైనల్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా, తొలిసారి ఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా జట్లు ప్రతిష్ఠాత్మక టెస్టు గద కోసం తలపడనున్నాయి. వాతావరణం అనుకూలించని పక్షంలో జూన్ 16ను రిజర్వ్ డేగా ప్రకటించారు. లార్డ్స్ మైదానం డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి కావడం విశేషం. పాట్ కమిన్స్ సారథ్యంలోని ఆస్ట్రేలియా జట్టు 2023లో ఓవల్‌లో జరిగిన ఫైనల్‌లో భారత్‌ను ఓడించి ఛాంపియన్‌గా నిలిచిన ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. ప్రస్తుతం టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియా, తమ టైటిల్‌ను నిలబెట్టుకోవాలని పట్టుదలగా ఉంది.

మరోవైపు టెంబా బవుమా నాయకత్వంలోని దక్షిణాఫ్రికా జట్టుకు ఇది తొలి డబ్ల్యూటీసీ ఫైనల్. ఇరు జట్లు అద్భుతమైన ఫామ్‌లో ఉండటంతో ఫైనల్ పోరు హోరాహోరీగా సాగే అవకాశం ఉంది.

ఈ మ్యాచ్ స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 10:30 గంటలకు (భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3 గంటలకు) ప్రారంభమవుతుంది. స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ ప్రత్యక్ష ప్రసారం కానుంది. అలాగే అభిమానులు డిస్నీ హాట్‌స్టార్ ద్వారా మ్యాచ్‌ను ఆన్‌లైన్‌లో కూడా వీక్షించవచ్చు.

ఈ టోర్నీలో ఛాంపియన్‌గా నిలిచిన జట్టు గదతో పాటు రూ.30.80 కోట్ల ప్రైజ్‌మనీ అందుకోనుంది. 2023తో పోలిస్తే ఇది రెట్టింపు కన్నా ఎక్కువే. గత రెండు సీజన్ (2021, 2023)కంటే ఇది దాదాపు రెండింతలు. గతంలో 2021, 2023 డబ్ల్యూటీసీ టోర్నీల్లో ఛాంపియన్ జట్లకు రూ.14 కోట్లు ఇచ్చారు. ఈసారి రన్నరప్‌గా నిలిచే జట్టు 2.1 మిలియన్ డాలర్లు (రూ.17 కోట్ల 94 లక్షలు) చేజిక్కించుకోనుంది. గత ఛాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా భారత్‌కు 8 లక్షల డాలర్లు మాత్రమే లభించాయి.

**జట్లు :**

**దక్షిణాఫ్రికా:** టోనీ డి జోర్జీ, ర్యాన్ రికెల్టన్, ఐడెన్ మార్క్రమ్, టెంబా బావుమా (కెప్టెన్), డేవిడ్ బెడింగ్‌హామ్, ట్రిస్టన్ స్టబ్స్, కైల్ వెర్రెయిన్, వియాన్ ముల్డర్, మార్కో యన్సెన్, కార్బిన్ బాష్, కగిసో రబాడా, లుంగి ఎంగిడి, డేన్ పాటర్సన్, కేశవ్ మహారాజ్, సెనురాన్ ముత్తుసామీ.

**ఆస్ట్రేలియా:** ఉస్మాన్ ఖవాజా, సామ్ కాన్‌స్టాస్, మార్నస్ లబుషేన్, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, అలెక్స్ కేరీ, జోష్ ఇంగ్లిస్, కామెరాన్ గ్రీన్, బ్యూ వెబ్‌స్టర్, పాట్ కమ్మిన్స్ (కెప్టెన్), మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, స్కాట్ బోలాండ్, నాథన్ లియాన్, మాట్ కుహ్నెమాన్.

# జూన్ 13న కన్నప్ప ట్రైలర్

**బలగం టీవీ, హైదరాబాద్**




మంచు విష్ణు ప్రధాన పాత్రలో బాలీవుడ్ దర్శకుడు ముకేశ్ కుమార్ సింగ్ తెరకెక్కిస్తోన్న కన్నప్ప సినిమా ట్రైలర్ విడుదలపై మేకర్స్ కీలక ప్రకటన చేశారు. ఈ నెల 13న ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ప్రత్యేక పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. కాగా, ఈ సినిమా జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో ప్రభాస్ తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్రతారలు కూడా నటిస్తున్న విషయం తెలిసిందే.

# సినిమా పేరు మార్పు

**బలగం టీవీ, హైదరాబాద్**

'ది కశ్మీర్ ఫైల్స్', 'ది తాష్కెంట్ ఫైల్స్' వంటి సంచలన చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి తన తదుపరి చిత్రం 'ది ఢిల్లీ ఫైల్స్' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాను 'ది కశ్మీర్ ఫైల్స్' నిర్మించిన టాలీవుడ్ బ్యానర్ అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకంపై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 5 2025న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రయూనిట్ చిత్ర టైటిల్‌పై సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఈ సినిమా టైటిల్‌ను 'ది ఢిల్లీ ఫైల్స్ నుంచి 'ది బెంగాల్ ఫైల్స్: రైట్ టు లైఫ్ అని మార్చినట్లుగా ప్రకటించాడు. ఈ సినిమా టీజర్‌ను జూన్ 12న విడుదల చేయనున్నారు. అభిషేక్ అగర్వాల్, పల్లవి జోషి సహనిర్మాతలుగా వ్యవహరించిన ఈ చిత్రంలో మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, పల్లవి జోషి, గోవింద్ నామ్‌దేవ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం అగ్నిహోత్రి 'ఫైల్స్' ట్రయాలజీలో మూడవ భాగం, దీనిలో 'ది తాష్కెంట్ ఫైల్స్' (2019) మరియు 'ది కశ్మీర్ ఫైల్స్' (2022) కూడా ఉన్నాయి.




# గద్దర్ అవార్డుల మొమెంటో విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వం గద్దర్ పేరుతో సినిమా అవార్డులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నెల 14న హైటెక్స్ వేదికగా అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ నేపథ్యంలో గద్దర్ అవార్డుల జ్ఞాపికను ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. జ్ఞాపికలో చేతికి రీల్ చుట్టుకున్నట్లుగా ఉండి, పైన చేతిలో డప్పు పట్టుకున్నట్లుగా, ఆ డప్పు మీద తెలంగాణ రాష్ట్ర చిహ్నాన్ని ముద్రించారు. గద్దర్ గుర్తింపుగా డప్పును ముద్రించినట్లు తెలుస్తోంది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సినిమాటోగ్రఫీ శాఖ సంయుక్తంగా దీన్ని రూపొందించాయి. 14వ తేదీన జరగనున్న గద్దర్ అవార్డుల ప్రధానోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తెలుగు సినీ పరిశ్రమ ప్రముఖులు హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు విజేతలకు జ్ఞాపికలను అందజేస్తారు. ఈ వేడుక కోసం నగరంలోని పలు ప్రాంతాల్లో హోర్డింగ్‌లను ఏర్పాటు చేయనున్నారు.

**యోగాను ప్రపంచానికి భారత్ ఇచ్చిన గిఫ్ట్ గా మెగాస్టార్ చిరంజీవి పేర్కొన్నారు. జూన్ 21న యోగా దినోత్సవాన్ని అందరూ కలిసి జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మెగాస్టార్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. "ఫోకస్ వల్ల ఫిట్‌నెస్ పెరుగుతుంది. కానీ, యోగా ఈ రెండింటినీ పెంచుతుంది. ఈ ఏడాది అంతర్జాతీయ యోగా డేను అందరం కలిసి సెలబ్రేట్ చేసుకుందాం. ప్రపంచానికి మన దేశం ఇచ్చిన బహుమతి యోగా. సరిహద్దులు దాటి దీన్ని సెలబ్రేట్ చేసుకుందాం" అని రాసుకొచ్చారు. శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత రెండింటినీ పెంపొందించడంలో యోగా ఒక సమగ్రమైన మార్గమని చిరంజీవి చెప్పారు.**